నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | వరంగల్, గురువారం 16 జనవరి 2025 | MAHABUBABAD


# ఎస్సారెస్పీ కెనాల్‌కు గండి

### వృథాగా పోయిన నీళ్లు

ఇనుగుర్తి, జనవరి 15 : ఇనుగుర్తి మండలంలోని మీఠ్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రికుంటతండా సమీపంలో మంగళవారం ఎస్సారెస్పీ కెనాల్ కాలువకు గండి పడింది. భారీగా నీళ్లు వృథా పోవడంతో అధికారులు నీటి సరఫరా నిలిపివేశారు. అయితే వెంటనే గండిని పూడ్చి తిరిగి నీళ్లు అందించాలని లేకపోతే తమ పంటలు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలో ఉన్న చెత్తాచెదారం, చెట్లకొమ్మల లాంటివి తొలగించడపోవడం వల్లే తరచూ ఎస్సారెస్పీ కెనాల్‌కు గండ్లు పడుతున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా కాలువలకు మరమ్మతులు చే యించాలని వారు అధికారులను కోరుతున్నారు.



వృథాగా పోతున్న నీళ్లు

# వెంకటాపురంలో ఇందిరమ్మ సర్వే షురూ

### 'నమస్తే'కథనానికి స్పందన

బయ్యారం, జనవరి 15 : బయ్యారం మండలం వెంకటాపురం, అల్లిగూడెం పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభమైంది. ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్‌లో ఈ రెండు గ్రామ పంచాయతీల్లోని ఎనిమిది గ్రామాలు లాగిన్ కాకపోవడంతో సర్వే మొదలుకాలేదు. ఈ క్రమంలో ప్రజలు ఆందోళన చెందుతున్న తీరుపై 'ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో.. ఆ ఊళ్లు మిస్' శీర్షికన ఈ నెల 8న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన జిల్లా యంత్రాంగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సాంకేతిక సమస్యను పరిష్కరించి బుధవారం ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించారు.



వెంకటాపురం జీపీ లక్ష్మీపురంలో సర్వే చేస్తున్న అధికారులు

# సంక్రాంతి సంబురం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఊరూరా సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. మహిళలు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి వాటిపై గొబ్బెమ్మలు పెట్టి సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించారు. గంగిరెద్దుల విన్యాసాలు.. హరిదాసుల కీర్తనలు ఆకట్టుకున్నాయి. లోగిళ్లన్నీ సందడిగా మారాయి. చిన్నారులు గాల్లో పతంగులు ఎగురవేశారు. పిల్లా పెద్దా సంతోషంతో గడిపారు. కనుమ పండుగ రోజు రైతులు తమ పాడి గేదెలు, కాడెడ్లను ముస్తాబు చేశారు. పిండి వంటకాలను వాటికి తినిపించారు. తమ కుటుంబాలు పాడిపంటలు, పసిడి రాశులతో తులతూగాలని దేవుళ్లకు మొక్కుకున్నారు.



దేవరుప్పలలో పశువులను మొక్కుతున్న రైతు గిరి దంపతులు



నెత్తిన గిన్నెతో హరి నామం చేస్తూ వచ్చే హరిదాసు స్టైల్ మార్చాడు. బయ్యారంలో బుధవారం ఇలా హైటెక్ హరిదాసు దర్శనమిచ్చాడు.




నర్సంపేట : గురిజాలలో వేసిన రంగు రంగుల ముగ్గు



చిన్నగూడూరు: గంగిరెద్దుకు బియ్యం పెడుతున్న చిన్నారులు

# మందుల సరఫరాలో గందరగోళం

- సకాలంలో పీహెచ్‌సీలకు చేరని ఔషధాలు
- రవాణా వ్యవస్థ లేక ఇబ్బందులు
- జిల్లా డ్రగ్ స్టోర్‌లో వసతులు కరువు
- వాహనాలు, సిబ్బంది కొరత
- ఉష్ణోగ్రతల నిర్వహణ వ్యవస్థ గాలికి



వరంగల్‌లోని కేంద్ర ఔషధ గిడ్డంగి

వరంగల్, జనవరి 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వ దవాఖానలకు మందుల సరఫరా ప్రక్రియ గందరగోళంగా మారింది. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఔషధాలు చేరవేసే వ్యవస్థ గాడి తప్పింది. ఫలితంగా ప్రజలకు అవసరమైన మందులు సకాలంలో అందక ఇబ్బంది అవుతున్నది. ప్రభుత్వ దవాఖానల్లో అత్యవసర మందుల కొరత ఉంటున్నది. పీహెచ్‌సీలకు అవసరమైన వ్యాక్సిన్లు, యాంటీబయాటిక్ వంటి అత్యవసర మందులు అందడం లేదు. చిన్న పిల్లలకు ప్రతినెలా ఇచ్చే వ్యాక్సిన్లు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే పీహెచ్‌సీ సిబ్బంది స్వయంగా సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు వెళ్లి మందులు తీసుకుపోవాల్సి వస్తున్నది. రెండు, మూడు రోజులకు ఒకసారి ఇలా డ్రగ్ స్టోర్‌కు వెళ్లడం, అటు పీహెచ్‌సీలో సేవలందించడం.. ఇలా రెండు రకాల పనులతో పీహెచ్‌సీల్లో ఆశించిన మేరకు వైద్యం అందని పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీల్లో మందుల కొరత సమస్య రోజురోజుకూ తీవ్రమై రోగులకు శాపంగా మారుతున్నది.

### సరఫరా వ్యవస్థ లేదు

గతంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి తపాలా శాఖ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ దవాఖానాలకు అవసరం మేరకు ప్రభుత్వం నేరుగా మందులను సరఫరా చేసేది. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన తర్వాత ఈ విధానాన్ని పక్కన పెట్టింది. కనీస వసతులు లేకుండా జిల్లాకు ఒక డ్రగ్ స్టోర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. జిల్లా పరిధిలోని పీహెచ్‌సీలు, ప్రభుత్వ దవాఖానాలకు ఇండెంట్ ప్రకారం డ్రగ్ స్టోర్ నుంచి మందుల సరఫరా చేయాలని నిర్ణయించింది. కొత్తగా ప్రకటించిన జిల్లా డ్రగ్ స్టోర్లలో కనీస వసతులు లేవు. ఇక్కడ మందులను నిల్వ చేసే పరిస్థితి లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు అందడం లేదు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మారుమూల ప్రాంతాల్లోని పీహెచ్‌సీలకు సకాలంలో మందులను రవాణా చేసిన తపాల శాఖ సేవలను ఏడాది నుంచి వినియోగించుకోవడం లేదు. దీని స్థానంలో వాహనాలను అద్దెకు తీసుకొని పీహెచ్‌సీలకు సరఫరా చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాలిచ్చింది. అంతేగాక సరఫరా చేసిన వాహనాల బిల్లులను ప్రభుత్వం ఎంతకీ చెల్లించడం లేదు. సంవత్సర కాలం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో డ్రగ్ స్టోర్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇండెంట్ పెట్టిన పీహెచ్‌సీల సిబ్బందిలో ఒకరు డ్రగ్ స్టోర్‌కు వచ్చి మందులు తీసుకుపోవాలని చెబుతున్నారు. డ్రగ్ స్టోర్, పీహెచ్‌సీ సిబ్బంది మధ్య పేదలకు మందులు అందడం లేదు.

### వసతుల కరువు

గతంలో ఉమ్మడి జిల్లాకేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి తపాలా శాఖ సేవలతో ప్రతి ప్రభుత్వ ఆస్పత్రికి మందులు సరఫరా అయ్యేవి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. వీటిలో వసతులు కల్పించడంలో విఫలమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు డ్రగ్ స్టోర్‌లను ఏర్పాటు చేశారు. ఈ స్టోర్లలో ఎలాంటి వసతులు కల్పించలేదు. జిల్లా పరిధిలో మందుల సరఫరా చేసేందుకు ఎలాంటి వాహనాలను సమకూర్చలేదు. డ్రగ్ స్టోర్‌లో అసరమైన మేరకు సిబ్బంది లేరు. జిల్లాలోని డ్రగ్ స్టోర్‌లు నామమాత్రంగా పనిచేస్తున్నాయి. డ్రగ్ స్టోర్‌కు మందులు వస్తే దింపి నిల్వ చేసేందుకు సిబ్బంది లేరు. డ్రగ్ స్టోర్స్ నిర్వహణ లేకపోవడం, మందులు సకాలంలో రాకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని 94 పీహెచ్‌సీలు, 17 అర్బన్ హెల్త్ సెంటర్లు, 6 బస్తీ దవాఖానలు, ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న పేద రోగులు మందులు అందక ఇబ్బంది పడుతున్నారు.

### కూలింగ్ వ్యవస్థ లేదు

కొత్తగా ఏర్పాటు చేసిన డ్రగ్ స్టోర్‌లలో మందులను నిల్వ చేసే వ్యవస్థ అధ్వానంగా ఉన్నది. మందులను నిల్వ చేసే ఉష్ణోగ్రత(కూలింగ్) నిర్వహణ లేదు. దీంతో మందులు సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. ముఖ్యంగా 0 నుంచి 8 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతల్లో నిల్వ ఉంచాల్సిన వ్యాక్సిన్లు జిల్లా డ్రగ్ స్టోర్‌లకు రావడం లేదు. ఏసీ వ్యవస్థలో నిల్వ చేయాల్సిన యాంటీబయాటిక్ మందులు ఉండడం లేదు. డ్రగ్ స్టోర్లలో నిల్వ సామర్థ్య వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నది.

## సిరంజీలు లేవు.. బయట తెచ్చుకోండి..!

- దంతాలపల్లి పీహెచ్‌సీలో పేషెంట్‌కు అందని వైద్యం
- సమయానికి డ్యూటీ డాక్టర్ లేక తప్పని ఇబ్బందులు

దంతాలపల్లి, జనవరి 15 : ఆరోగ్యం బాగాలేదని సర్కారు దవాఖానకు వచ్చిన మహిళలకు ఇబ్బందులు తప్పలేదు. సకాలంలో స్పందించాల్సిన డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోగా, చికిత్స కోసం అవసరమైన మందులు, సిరంజీలు లేకపోవడంతో రోగులకు పరీక్ష పెడుతోంది. ఈ సంఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగింది. పులుగుజ్జ శంకరమ్మకు వాంతులై నీరసంగా ఉండడంతో కుటుంబసభ్యులు బుధవారం ఆమెను పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ఆ సమయంలో డాక్టర్ లేకపోవడంతో అందుబాటులో ఉన్న స్టాఫ్ నర్సు చికిత్స చేసేందుకు ప్రయత్నించింది. ఇంజక్షన్ వేసేందుకు 2 ఎంఎల్ సిరంజీలు లేవని, బయటకు వెళ్లి కొనుగోలు చేసి తెచ్చుకోవాలని తెలిపింది. డాక్టర్ అందుబాటులో లేకపోగా కనీసం ఆసుపత్రిలో మందులు కూడా లేకపోవడంతో పేషెంట్లు ఇబ్బందులు పడ్డారు. దీనిపై డాక్టర్ చైతన్యను వివరణ కోరగా సాయంత్రం 5గంటలకు శంకరమ్మను ఆసుపత్రికి తీసుకువచ్చారని, తాను అందుబాటులో లేకున్నా సిబ్బందికి చికిత్స అందించాలని తెలిపానన్నారు. ఆసుపత్రిలో మందులు కొరత ఉన్నది వాస్తవమేనని అంగీకరిస్తూనే శంకరమ్మ కొంత మద్యం సేవించినట్లు సిబ్బంది తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పడం గమనార్హం.



దంతాలపల్లి ప్రభుత్వ దవాఖానలో నీరసంతో కింద పడుకున్న శంకరమ్మ



కొత్తకొండ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు



ఐనవోలులో పెద్ద బండితో వస్తున్న మార్నేని వంశీయులు

# జన జాతర

- భక్తులతో కిక్కిరిసిన కొత్తకొండ, ఐనవోలు ఆలయాలు
- వీరభద్రుడికి కోరమీసాలు, మల్లన్నకు నైవేద్యం సమర్పణ
- ఆకట్టుకున్న ఎడ్లబండ్ల రథాలు, పెద్ద బండి శోభాయాత్ర



భీమదేవరపల్లి/ఐనవోలు, జనవరి 15: కొత్తకొండ వీరభద్రుడి, ఐనవోలు మల్లన్న జాతర్లకు భక్తులు పోటెత్తారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళ, బుధ వారాల్లో లక్షలాది మంది హాజరై స్వామి వార్లను దర్శించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చాలని వీరభద్ర స్వామి వారికి కోరమీసాలు సమర్పించారు. తమగండాలు తొలగిపోవాలని గండ దీపంలో నూనె పోశారు. కోడె ప్రదక్షిణలు చేశారు. ఆలయ చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్‌గుప్తా, ఈవో కిషన్‌రావు సదుపాయాలు కల్పించారు. వేలేరుకు చెందిన యాదవులు డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య మేకల బండితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎడ్లబండ్లను బంతిపూలతో వివిధ రంగులతో అందంగా అలంకరించిన రథాలను తిలకించేందుకు ప్రజలు దారి వెంట బారులు తీరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా స్వామి వారిని దర్శించుకున్నారు. ఐనవోలు మల్లికార్జున స్వామి, ఎల్లమ్మ దేవతకు భక్తులు బోనాలు చేసి శివసత్తుల పూనకాలతో నైవేద్యం సమర్పించారు. స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేసి బిల్వార్చన శివలింగాన్ని అలంకరించారు. బంగారు బీసాలు, వెండి కిరీటం, కవచం సుగంధాలు వెదజల్లే గజ పుష్పమాలతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కొబ్బరికాయ కొట్టి పెద్ద రథాన్ని ప్రారంభించగా, పుర వీధుల గుండా ఆలయానికి చేరుకున్నది. ఒంటి మామిడిపల్లి, ముల్కలగూడెం, పెరుమాండ్లగూడెం గ్రామాలను నుంచి కూడా ప్రభ బండ్లు కట్టి స్వామి వారికి మహానివేదనగా సమర్పించారు. మల్లన్నను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, దేవాదాయ శాఖ వరంగల్ ఉప కమిషనర్ సంధ్యారాణి, సహాయ కమిషనర్ రామాల సునీత దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మల్లికార్జున స్వామికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## మల్లన్న ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- సీఎం రేవంత్‌రెడ్డివి చిల్లర చేష్టలు
- బీఆర్ఎస్ నేతల అరెస్ట్ ఏడో గ్యారెంటీ పథకమా?
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు/దేవరుప్పుల: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన స్వామి వారిని దర్శించుకుని మాట్లాడారు. ఈ ఆలయం అంటే తనకు 50 ఏళ్ల నుంచి చాలా సెంటిమెంటని, ప్రతి సంవత్సరం ఇక్కడికి వస్తానని పేర్కొన్నారు. ప్రతి జాతర కోసం నిధులు కేటాయించి అద్భుతంగా తయారు చేశామన్నా రు. ప్రత్యేకంగా 40 ఏళ్ల నుంచి ఈవో, అధికారులు వచ్చి తనకు ఆహ్వానం ఇచ్చేవారని, కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. తనకు గతం నుంచి ఉన్న అనుబంధంతో, కార్యకర్తల పిలుపు మేరకు కుటుంబ సభ్యులు, కార్యకర్తలతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నానని తెలిపారు. పోరాటాలే ఊపిరిగా ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చి పదేండ్ల పాలనలో బంగారు తెలంగాణగా మార్చిన గులాబీ నేతల శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న చిల్లర చేష్టలను ప్రజలు ఏవగించుకుంటున్నారని ఎర్రబెల్లి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఫిరాయింపు రాజకీయాలను ప్రశ్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చేతకాక, డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలు, శ్రేణులను అరెస్ట్ చేయడమే ఏడో గ్యారెంటీ పథకంగా అమలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ప్రజల పక్షాన ప్రశ్నిస్తే సమాధానం చెప్పే చేవలేక అణచివేతకు పాల్పడడం అప్రజాస్వామికమన్నారు. పూటకో అక్రమ కేసు, రోజుకో అరెస్ట్ తీరుగా పాలన సాగిస్తున్న రేవంత్ సర్కారును ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. నిత్యం ప్రజలతో ఉండే ఓ ఎమ్మెల్యేను పండుగ పూట అరెస్టు చేసి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల వేళ ఫిరాయింపులను అక్రమమన్న రేవంత్‌రెడ్డి 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ కండువాలు ఎలా కప్పారని ఎర్రబెల్లి ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు వెన క్కి తీసుకుని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# తూర్పు కాంగ్రెస్‌లో వర్గపోరు

- వనదేవత సాక్షిగా రాజకీయం
- నేతృత్వం వహించిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్, జనవరి 15 : వన దేవతల సాక్షిగా తూర్పు కాంగ్రెస్ రాజకీయం రసవత్తరంగా మారింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య వర్గ రాజకీయానికి తెరలేపడం సంచలనంగా మారింది. తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ కొత్త వారికి ప్రాధాన్యం కల్పించడంతో పాత క్యాడర్ రగిలిపోతున్నది. దీంతో కాంగ్రెస్‌లో చేయితిరిగిన నాయకుడిగా గుర్తింపు ఉన్న సారయ్య నేతృత్వంలో కాంగ్రెస్‌లో రెండో వర్గం పురుడు పోసుకున్నది. కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి సైలెంట్‌గా ఉన్న ఆయన వన దేవతలకు మొక్కులు చెల్లించడంతో పాటు తల్లుల సాక్షిగా వర్గ రాజకీయానికి తెరలేపడం తూర్పులో హాట్ టాపిక్‌గా మారింది.

### భారీగా బైలెల్లిన అనుచరగణం..

మేడారం సమ్మక్క-సారలమ్మ వద్ద ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నిర్వహించిన రాజకీయ సమావేశానికి కాంగ్రెస్ శ్రేణులు, దశాబ్దాల కాలంగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్న క్యాడర్ తరలివెళ్లింది. నాలుగు బస్సులు, సుమారు 25 కార్లలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు సారయ్య వెంట నడిచేందుకు కదిలారు.

### అధిష్టానం ఆదేశాలతోనేనా?

కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలతోనే ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య తల్లుల సాక్షిగా అనుచరులతో సమావేశం నిర్వహించారని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యవహార శైలితో పార్టీకి నష్టం కలిగిందని, ఆమెకు చెక్ పెట్టేందుకే బస్వరాజు సారయ్యకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారని కార్యకర్తలు చెవులు కొరుక్కుంటున్నారు. రాబోయే రోజుల్లో తూర్పు రాజకీయం ఏ మలుపు తిరుగుతుందో అనే చర్చ జోరుగా సాగుతున్నది.

## ఎన్పీడీసీడీసీఎల్‌కు అవార్డుల పంట

### నాలుగు విభాగాల్లో ఎంపిక

హనుమకొండ, జనవరి 15: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి నాలుగు ఇప్పాయి (ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా) అవార్డులు దక్కాయి. ఈ నెల 11వ తేదీన కర్ణాటకలోని బెల్గామ్‌లో జరిగిన 25వ రెగ్యులేటరీ అండ్ పాలసీ మేకర్స్ రిట్రీట్ కార్యక్రమంలో వీటిని ప్రకటించారు. వినియోగదారులకు ఉత్తమమైన సేవలు, మెరుగైన విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాల తగ్గుదల, సోలార్ ప్రోత్సాహం అందించినందుకు నాలుగు అవార్డులు దక్కాయి. ఆపరేషన్ సీజీఎం కే రాజు హన్ హాజరై వీటిని అందుకున్నారు. నాలుగు విభాగాల్లో గెలుచుకున్న అవార్డులు, సర్టిఫికెట్లను బుధవారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో ఇన్‌చార్జి డైరెక్టర్లు, సీజీఎంలు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులకు ఉత్తమమైన సేవలందించినందుకు అవుట్ స్టాండింగ్ అచీవ్మెంట్ అండర్ ది బెస్ట్ పెర్ఫార్మింగ్‌కు అవార్డు దక్కిందని అన్నారు. 45720 కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్ పెరిగి నందుకు డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ జనరేషన్ అవార్డు వచ్చిందన్నారు. 1011కెపాసిటర్ బ్యాంక్స్ 2ఎంవీఏఆర్, 553 కెపాసిటర్ బ్యాంక్స్ 2/1 ఎంవీఏఆర్ నష్టాలను తగ్గించడానికి, పవర్ ఫ్యాక్టర్ మెరుగుపరిచినందుకు అవార్డుతో పాటు ఐఆర్‌డీఏ జీపీఆర్ఎస్ ఎనేబుల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పాట్ బిల్లింగ్‌కు మరో అవార్డు దక్కిందన్నారు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఎప్పటికప్పుడు వినియోగదారులకు మరింత ఉత్తమ సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు సీఎండీ వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బీ అశోక్ కుమార్, టీ మధుసూదన్, తిరుపతి రెడ్డి, సీఈలు రాజు హన్, అశోక్, కేఎస్ గుట్ట, జాయింట్ సెక్రటరీ కే రమేశ్ పాల్గొన్నారు.



అవార్డులు, సర్టిఫికెట్లతో సీఎండీ వరుణ్‌రెడ్డి, ఇన్‌చార్జి డైరెక్టర్లు, సీజీఎంలు